



ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయనిర్ణేతలు

- సందడిగా 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముత్యాల ముగ్గుల పోటీలు
- ఉత్సాహంగా పాల్గొన్న మహిళలు, యువతులు

ముచ్చటగొలిపే.. ముగ్గులు



ప్రథమ స్థానం సాధించిన రాయిపల్లి ఆశాజ్యోతి వేసిన ముగ్గు

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

సంక్రాంతిని పురస్కరించుకుని.. ముంగిళ్లన్నీ ముగ్గులతో నిండి సప్తవర్ణ శోభితమైపోతాయి. ఈ నేపథ్యంలో తెలుగింటి ఆడపడుచుల అభిరుచిని ప్రోత్సహించి.. వారి ప్రతిభను చాటుకునేలా 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ఆధ్వర్యంలో ఆదివారం శ్రీకాకుళంలో నిర్వహించిన ముత్యాల ముగ్గుల పోటీలకు విశేష స్పందన లభించింది. "ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు.. పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు... రియల్ పార్టనర్ స్వర్గసీమ సుకేతన" సహకారంతో సందడిగా సాగాయి. ఆదివారం శ్రీకాకుళం నగరంలోని ఎన్టీఆర్ ఎంసీహెచ్‌స్కూల్ గ్రౌండ్స్‌లో ఆదివారం ఉదయం 10 గంటలకు ముగ్గుల పోటీలు ప్రారంభమయ్యాయి. జిల్లా నలు మూలల నుంచి అధిక సంఖ్యలో మహిళా మణులు, యువతులు పెద్ద సంఖ్యలో హాజరై... ఉత్సాహంగా పోటీలో పాల్గొన్నారు. తెలుగు సంస్కృతీ సంప్రదాయాలు ఉట్టిపడేలా.. ముగ్గులతో నైపుణ్యాన్ని చాటుకున్నారు. విభిన్న రంగులతో రంగవల్లికలను తీర్చిదిద్ది.. ప్రశంసలు అందుకున్నారు. శ్రీకాకుళం గుడివీధికి చెందిన రాయిపల్లి ఆశాజ్యోతి ప్రథమ స్థానం సాధించారు. శ్రీకాకుళం నగరానికి చెందిన కె.ఆదిలక్ష్మి, కె.సంతోషి ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. ఈ పోటీల నిర్వహణకు మీనాక్షి ఆసుపత్రి (శ్రీకాకుళం) అధినేతలు గొండు శంకర్ (కృష్ణప్పపేట), డాక్టర్ గొండు గంగాధర్ (గ్యాస్ట్రోఎంట్రాలజిస్ట్) స్పాన్సర్‌గా వ్యవహరించారు. ముఖ్య అతిథులుగా జిల్లా గ్రామీణాభివృద్ధి ప్రాజెక్ట్ డైరెక్టర్ విద్యాసాగర్, జిల్లా అదనపు వైద్యారోగ్యశాఖ అధికారి అనూరాధ హాజరయ్యారు. న్యాయ నిర్ణేతలుగా ఆర్ట్ ఆఫ్ లివింగ్ టీచర్ కల్పన, మాజీ కౌన్సెలర్ అంబటి లక్ష్మీరాజ్యం, చేయూత అధ్యక్షురాలు వెంకటలక్ష్మి, బీహెచ్ఆర్సీ మహిళాసెల్ అధ్యక్షురాలు మణిశర్మ వ్యవహరించారు. ముఖ్య అతిథులు, స్పాన్సర్స్ చేతుల మీదుగా ప్రథమ విజేతకు రూ.6వేలు, ద్వితీయ విజేతకు రూ.4వేలు, తృతీయ విజేతకు రూ.3వేలు చొప్పున నగదు పురస్కారాలను అందజేశారు. వీకే జ్యోతి, పి.రాజశ్రీ, కె.మంజు, కె.పావని, ద్రాక్షాయని, బి.మాధురి, ఏ. శ్రావణి, కె.కీర్తి, ఎం.అనూష కన్సోలేషన్ బహుమతులు గెలుచుకున్నారు. వీరితోపాటు పోటీల్లో పాల్గొన్న వంద మహిళలకు చీరలు, యువతులకు చుడీదాస్ డ్రస్ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్పాన్సర్లు గొండు శంకర్ దంపతులు, డా.గొండు గంగాధర్, డా.హరిత, ఆంధ్రజ్యోతి శ్రీకాకుళం యూనిట్ బ్రాంచ్ మేనేజర్ ఆర్.సోమశంకర్, ఆంధ్రజ్యోతి- ఏబీఎన్ సిబ్బంది పాల్గొన్నారు.



అమ్మకు చిన్నారి సాయం



వృద్ధులు సైతం..



విజేతలు.. ఆశాజ్యోతి, ఆదిలక్ష్మి, సంతోషి



ద్వితీయ స్థానం సాధించిన ఆదిలక్ష్మి వేసిన ముగ్గు



తృతీయ స్థానంలో సంతోషి వేసిన ముగ్గు



ప్రథమ విజేత ఆశాజ్యోతికి చెక్కు అందజేస్తున్న దృశ్యం



శ్రీకాకుళం ఎన్టీఆర్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ మైదానంలో ముగ్గులు వేస్తున్న మహిళలు, యువతులు

వైద్యులు ➝ మందులు కొరత

- అస్తవ్యస్తంగా సంచార పశువైద్యం
- రెండేళ్లకే పడకేసిన పథకం

(ఇచ్ఛాపురం రూరల్)

పాడి రైతులకు పశువైద్య సేవలు సక్రమంగా అందడంలేదు. సంచార పశువైద్య కేంద్రాలతో పాటు, పశువైద్యశాలలో వైద్యులు, సిబ్బంది కొరత అధికంగా ఉంది. రైతుల చెంతకే మెరుగైన వైద్య సేవలందించాలనే లక్ష్యంతో ప్రవేశపెట్టిన డాక్టర్ వైఎస్ఆర్ సంచార పశు ఆరోగ్య సేవ పథకం క్షేత్రస్థాయిలో నీరుగారిపోతోంది. జిల్లాలో నియోజకవర్గానికి రెండు చొప్పున మొత్తం 16 అంబులెన్సు వాహనాలు ఏర్పాటు చేశారు. కాగా కొన్ని వాహనాల్లో వైద్యులు, అవసరమైన మందులు అందుబాటులో లేవు. పథకం ప్రారంభించిన రెండేళ్లకే ఈ వాహనాలు మూలకు చేరుతున్నాయి. అత్యవసర సమయాల్లో ఫోన్ చేసినా సకాలంలో వాహనాలు రాకపోవడంతో పశువులు మరణిస్తున్నాయని రైతులు వాపోతున్నారు.



ప్రైవేటుదే బాధ్యత..

ప్రభుత్వం ఈ పథకం నిర్వహణ బాధ్యతను ఓ ప్రైవేటు సంస్థకు అప్పగించింది. అందువల్ల వైద్యులను కూడా తాత్కాలికంగా నియమిస్తున్నారు. కొన్నిచోట్ల వైద్యులు ఉన్నా వాహనాల్లో కనిపించడంలేదు. ఇచ్ఛాపురం మండలం ఈదుపురం, కొలిగాం తదితర చోట్ల వైద్యులు అందుబాటులో లేరు. వైద్యులను నియమించినా వారిలో కొందరు మానేయడంతో ఆ పోస్టులు ఖాళీగానే ఉంటున్నాయి. వైద్యుడు అందుబాటులో లేకపోతే జిల్లా నుంచి టెలీ మెడిసిన్ ద్వారా వీడియోకాల్‌లో చికిత్స అందిస్తున్నామని సిబ్బంది చెబుతున్నారు. ఈ అంబులెన్సుల్లో 81 రకాల మందులు అందుబాటులో ఉండాలి. కానీ ప్రథమ చికిత్సకు అవసరమైన మందులు కూడా ఉండటం లేదు. పశువుల్లో తరచూ తలెత్తే జ్వరం, మేతమేయక పోవడం, వంటి సమస్యలకు సంబంధించిన మందులు, పెయిన్ కిల్లర్స్ కూడా దొరకని పరిస్థితి. అధికారుల దృష్టికి వెళ్లినా పట్టించుకోవడం లేదని రైతులు పేర్కొంటున్నారు.

ప్రచారం భళా.. అమలులో డీలా.. :

1962 నెంబరుకు ఫోన్ చేస్తే వాహనం రైతు వద్దకు వచ్చి సేవలందించాలి. అత్యవసర పశువైద్య సేవలకు ఉపయోగపడే మొబైల్ వాహన అంబులెన్స్‌లో వైద్యుడు, పారావెట్, అటెండర్ కమ్ డ్రైవర్ ఉంటారు. పశువుకు హిస్టారెక్టమీ సహా పలు శస్త్ర చికిత్సలు, 20 రకాల పేడ పరీక్షలు, 15 రకాల రక్త పరీక్షలు చేసేందుకు వీలుగా 54 రకాల పరికరాలు మినీ ఫ్రిజ్ వాహనంలో అందుబాటులో ఉండాలి. ప్రతి అంబులెన్సులో మొత్తం రూ.35 వేల విలువైన 81 రకాల మందుల్ని ఉంచాలి. కదల్లేని స్థితిలో ఉన్న పశువులను హైడ్రాలిక్ సాయంతో వాహనంలోకి ఎక్కించి, దగ్గరలోని ఆసుపత్రిలో చికిత్స ఇప్పించి, తిరిగి రైతు ఇంటి వద్ద దింపి వెళుతుంది. ఈ వాహనం. కానీ ఈ సేవలు పేరుకే గానీ క్షేత్రస్థాయిలో అందడం లేదని రైతులు వాపోతున్నారు.

ప్రభుత్వానికి వివరించాం

జిల్లాలో పాడి రైతులకు ఇబ్బందులు లేకుండా వైద్య సేవలందిస్తున్నాం. కొన్ని పశువైద్య వాహనాలలో మందుల కొరతపై ప్రభుత్వానికి తెలియజేశాం. పశువైద్యశాలల్లోని మందులు అందిస్తున్నాం. త్వరలో అన్ని వాహనాల్లో మందులు, వైద్యులు ఉండేలా చర్యలు తీసుకుంటాం.

- డాక్టర్ కిషోర్, జేడీ, పశుసంవర్థకశాఖ, శ్రీకాకుళం



టెక్కలి : అచ్చెన్నాయుడుకు వినతితపత్రం అందజేస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగుల సంఘ నేతలు

హామీలను అమలు చేయాలి

- సమగ్రశిక్ష ఉద్యోగుల డిమాండ్

అరసవల్లి, జనవరి 7: ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని సమగ్ర శిక్ష ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఆదివారం శ్రీకాకుళంలో సమగ్రశిక్ష ఉద్యోగులు నిర్వహిస్తున్న 19వ రోజు సమ్మె శిబిరాన్ని యూటీఎఫ్ కార్యదర్శి ఎస్.కిషోర్‌కుమార్ సందర్శించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లనే ఉద్యోగులు సమ్మెబాట పట్టాల్సి వచ్చిందని పేర్కొన్నారు. ఎస్టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సూర పాపారావు మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం కల్పించాలని కోరారు. యూటీఎఫ్ కార్యవర్గ సభ్యుడు మజ్జి మదన్‌మోహన్ మాట్లాడుతూ ఉద్యోగులందరికీ హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలన్నారు. సమగ్రశిక్ష ఉద్యోగుల జేఏసీ జిల్లా అధ్యక్షుడు పైడి మురళీకృష్ణ మాట్లాడుతూ జీతాలు పెంపుదల చేయాలని, పెండింగ్ జీతాలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ కోశాధికారి శ్రీనివాసరావు, నర్సింగరావు, యుగంధర్, గౌరీశంకర్, శైలజ, జ్యోతి, రోహిణి, భారతి భవాని, నాగమణి, శశిరేఖ, చిన్నారావు, తవిటినాయుడు, చంద్రశేఖర్, ధనుంజయ పాల్గొన్నారు.

ఎస్ఎస్ఏ ఉద్యోగులకు అండగా నిలవాలి

టెక్కలి: సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తాము చేపట్టిన ఉద్యమానికి అండగా నిలవాలని సమగ్ర శిక్ష జేఏసీ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు ఆదివారం కోటబొమ్మాళిలోని టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడును కలిసి వినతిపత్రం అందించారు. న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదని, తమకు అన్ని విధాలా అండగా నిలవాలని కోరారు. అచ్చెన్నాయుడును కలిసిన వారిలో ఆ సంఘ అధ్యక్షుడు పి.మురళీకృష్ణ, ప్రధాన కార్యదర్శి తవిటినాయుడు, కోశాధికారి శ్రీనివాసరావు, నేతలు పోతయ్య, రాము, తారకేశ్వరరావు, జయలక్ష్మి, ఉషారాణి ఉన్నారు.



అరసవల్లి : శ్రీకాకుళంలో సమ్మె చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

ఎస్మా ప్రయోగం సరికాదు

- జీవో ప్రతులను దహనం చేసిన అంగన్‌వాడీలు



జీవో నెంబర్-2 ప్రతులను దహనం చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, సీఐటీయూ నేతలు

అరసవల్లి, జనవరి 7: అంగన్‌వాడీ కార్యకర్తలపై రాష్ట్ర ప్రభుత్వం ఎస్మా ప్రయోగించడం దారుణమని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె.కళ్యాణి అన్నారు. ఆదివారం స్థానిక జ్యోతిబాపూలే పార్కువద్ద అంగన్‌వాడీలు రెండో రోజు 24 గంటల రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీలపై ఎస్మా ప్రయోగిస్తూ ప్రభుత్వం తెచ్చిన జీవో నెంబర్-2ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు జీవో ప్రతులను దహనం చేశారు. ఈ జీవో ప్రభుత్వ నియంతృత్వ ధోరణికి నిదర్శనమని, దీనిని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాలన్నీ ముక్తకంఠంతో ఖండించాలని పిలుపునిచ్చారు. అంగన్‌వాడీలు లబ్ధిదారులకు పంచే పోషక పదార్థాలను అత్యవసర సర్వీసులో చేర్చడం చట్ట వ్యతిరేకమన్నారు. ఎస్మా ప్రయోగమంటే ప్రజల సహజ హక్కులపై దాడి చేయడమేనన్నారు. ఈ నెల 9న జిల్లా వ్యాప్తంగా అన్ని కార్మిక సంఘాలు, అనుబంధ సంఘాలు జైల్‌భరో నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏపీ అంగన్‌వాడీ యూనియన్ నాయకులు అల్లంశెట్టి కనక నాగరత్నం, బసవ యోగీశ్వరి, దోమ సరస్వతి, మంతెన ధనలక్ష్మి, కె.పార్వతి, ఎన్ని విజయలక్ష్మి, కుందు ధనలక్ష్మి, అల్లు సరస్వతి, కొండా రాజేశ్వరి, దాసరి తవిటమ్మ పాల్గొన్నారు.

సంప్రదాయం ఉట్టిపడేలా..

● ఆటకట్టుకున్న 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముగ్గుల పోటీ





లోగోలు వేస్తున్న మహిళలు



ఆకట్టుకునేలా సంక్రాంతి ముగ్గు..

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

సంప్రదాయం ఉట్టిపడేలా "ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు.. పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు.. రియల్ పార్ట్‌నర్ స్వర్ణసీమ సుకేతన" ముత్యాల ముగ్గుల పోటీలు ఆదివారం శ్రీకాకుళంలో జరిగాయి. నగరంలో ఎన్టీఆర్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ మైదానంలో నిర్వహించిన ఈ పోటీల్లో మహిళలు, విద్యార్థినులతోపాటు వృద్ధులు సైతం పాల్గొని ఉత్తేజపరిచారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన డీఆర్డీఏ పీడీ విద్యాసాగర్, డిప్యూటీ డీఎంహెచ్‌వో అనూరాధ, స్పాన్సర్స్ గొండు శంకర్ దంపతులు, డాక్టర్ గొండు గంగాధర్ దంపతులు విజేతలకు బహుమతులు అందజేశారు.



ముగ్గులు వేస్తున్న మహిళలు, విద్యార్థినులు



ముగ్గులు పరిశీలిస్తున్న న్యాయనిర్ణేతలు, స్పాన్సర్లు, ముఖ్యఅతిథులు

తెలుగుదనం ఉట్టిపడేలా పోటీలు



తెలుగుదనం ఉట్టిపడేలా పోటీలు జరిగాయి. ఆంధ్ర జ్యోతి-ఏబీఎన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలకు స్పాన్సర్‌గా వ్యవహరించడంతో పాతతరం నాటి జ్ఞాపకాలు.. ఆచారాలు, సంప్రదాయాలు.. ప్రత్యేకించి మహిళలకు ముగ్గులపై ఉన్న ఆసక్తిని పెంచేలా చేశాయి. సంక్రాంతి పండగ నేపథ్యంలో చేపట్టిన పోటీలు జిల్లాలో ఎంతగానే ఆసక్తికలిగించాయి. భవిష్యత్తులో చైతన్యం కలిగేలా చేపట్టే కార్యక్రమాలకు తన వంతు మద్ధతు అందిస్తాను.

\- గొండు శంకర్, కృష్ణప్పపేట, స్పాన్సర్



విజేతలకు బహుమతులు అందిస్తున్న స్పాన్సర్లు





చాలా ఆనందంగా ఉంది



ఇంత పెద్దఎత్తున మహిళలు పాల్గొనడం.. పోటీలను తిలకించేందుకు భారీ ఎత్తున జనం తరలిరావడం చాలా ఆనందంగా ఉంది. మహి ళలు మానసికంగా ధృడంగా ఉండాలి. ఆనవాయితీగా వస్తున్న సంప్రదాయాలను గౌరవిస్తూ ముగ్గులు వేస్తుంటే వారికి కలిగే ఆనందం.. అలాగే విద్యార్థినలు కూడా ఇప్పటితరంలో ఇటువంటి పోటీలపై ఆసక్తి చూపడం సంతోషంగా ఉంది.

\- డాక్టర్ గొండు గంగాధర్, స్పాన్సర్, మీనాక్షి హాస్పిటల్, శ్రీకాకుళం

సంప్రదాయం ముఖ్యమే..

మహిళలు ఆరోగ్య విషయంతో పాటుగా సంప్రదాయాలను గౌరవించే విషయంలో ప్రాధాన్యం ఇవ్వడం ముఖ్యం. అధికస్థాయిలో మహిళలు పాల్గొని సంక్రాంతి పండగను ముందే తీసుకు వచ్చినట్టుగా రంగవల్లులను ఆవిష్కరించడం ఆనందంగా ఉంది. పోటీల్లో ప్రతిఒక్కరు వేసిన ముగ్గులు అత్యద్భుతంగా ఉన్నాయి.

\- అనూరాధ, డిప్యూటీ డీఎంహెచ్‌వో

సంస్కృతిని కాపాడతాయి..

తెలుగు సంస్కృతి సంప్రదాయాలను కాపాడాలంటే ఇటువంటి పోటీలు అవసరం. సంప్రదాయాలు అంతరించి పోకుండా ఉండాలంటే మహిళలకు అవగాహన అవసరం. ఇటువంటి కార్యక్రమాలతో ఒకరిని చూసి మరొకరు స్ఫూర్తిని పొందుతారు. ఇటువంటి పోటీలు ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహించడం అభినందనీయం.

\- విద్యాసాగర్, డీఆర్డీఏ పీడీ

ఏటా పాల్గొంటున్నా..

'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ఆధ్వర్యంలో ఏటా జరిగే ముత్యాల ముగ్గుల పోటీల్లో పాల్గొంటున్నాను. ఎన్ని పనులున్నా వాటిని మానుకుని పోటీలకు హాజరవుతూ.. కచ్చితంగా బహుమతి సాధిస్తున్నాను. తెలుగుదనం ప్రజలకు తెలిసేలా.. అవగాహన కల్పించేలా ముగ్గును వేస్తుంటాను. రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాను. మహిళలు అందరూ ముగ్గులపై మక్కువ పెంచుకోవాలి.

\- ఆర్.ఆశాజ్యోతి, ప్రథమ బహుమతి విజేత

బహుమతి కోసం కాదు..

ప్రతి సారి పోటీల్లో పాల్గొంటున్నా బహుమతి ఆశించి మాత్రం కాదు. మంచి ముగ్గులు వేయాలన్న తపన, భవిష్యత్తు తరాలకు మన సంప్రదాయాలు అందించాలనే ఆలోచనతోనే ఏటా ఈ పోటీల్లో పాల్గొంటున్నాను. ఈసారి బహుమతి రావడం ఆనందంగా ఉంది.

\- కె.ఆదిలక్ష్మి, ద్వితీయ బహుమతి విజేత

స్ఫూర్తి నింపేందుకే..

ఇప్పటి తరం వారికి స్ఫూర్తినింపేలా ముగ్గుల పోటీలను నిర్వహించారు. వీలైనంతవరకు నాకు వచ్చిన ముగ్గును వేద్దామని.. సంక్రాంతి పండగను కూడా ముగ్గులో వివరిద్దామని ప్రయత్నం చేశాను. బహుమతి రావడం సంతోషంగా ఉంది.

\- కె.సంతోషి, తృతీయ బహుమతి విజేత

కారు ఢీకొని వృద్ధుడి మృతి

పలాస: పలాస బైపాస్ రోడ్డు కంబిరిగాం జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన ప్రమాదంలో టెక్కలి మండలం బన్నువాడకి చెందిన ఆర్.షణ్ముఖరావు(60) అనే వృద్ధుడు మృతి చెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. ద్విచక్ర వాహనంపై కోసంగిపురం వైపు వెళ్తున్న షన్ముఖరావును వెనుక నుంచి కారు ఢీకొంది. తీవ్రంగా గాయపడిన ఆయన్ను 108 వాహనంలో టెక్కలి ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందినట్లు ఏఎస్ఐ సంజీవరావు తెలిపారు. కోసంగిపురంలో ఉన్న తన కుమార్తెను సంక్రాంతికి పిలుపు చేసేందుకు వెళ్లిన షణ్ముఖరావు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు రోదిస్తున్నారు. కాగా, ప్రమాదానికి గురైన కారు రోడ్డుపక్కకు పడిపోయింది. అందులో ప్రయాణిస్తున్న వారు త్రుటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ పేర్కొన్నారు.

గాయపడిన తాపీమేస్త్రీ మృతి

కంచిలి: కేశుపురానికి చెందిన తాపీమేస్త్రీ ఆదివారం చికిత్సపొందుతూ మృతి చెందాడు. ఎస్ఐ ఎస్.బాలరాజు కథనం మేరకు.. కేశుపురం గ్రామానికి చెందిన తాపీ మేస్త్రీ నిరంజన్ ప్రధాన్ శనివారం జిల్లుండలో సన్‌సైడ్‌పై నిలబడి ప్లాస్టింగ్ చేస్తున్నాడు. ఆ సమయంలో ప్రమాదవశాత్తు జారిపడిపోవడంతో తలకు బలమైన గాయం తలిగింది. దీంతో 108లో శ్రీకాకుళం, అనంతరం మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. నిరంజన్ ప్రధాన్‌కు భార్య సత్యభామ ఉన్నారు. కుమారుడు వలస కూలీగా పనిచేస్తున్నాడు. భార్య ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఎస్.బాలరాజు కేసు నమోదు చేశారు.

నాలుగు ఎకరాల వరి కుప్పలు దగ్గం

● రూ. 1.90 లక్షల ఆస్తి నష్టం



మంటలను అదుపుచేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

జి.సిగడాం: మండలంలోని పెంట గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం కిల్లారి రమణ అనే రైతుకు చెందిన నాలుగు ఎకరాల వరి కుప్పలు కాలిపోయాయి. నూర్పు చేసేందుకు రమణ తన కల్లంలో వరి కుప్పలు పెట్టాడు. అయితే పైనుంచి వెళ్తున్న విద్యుత్ తీగలు షార్ట్ సర్క్యూట్‌జరిగి కుప్పలపై నిప్పులు రాలడంతో కాలిపోయినట్లు గ్రామస్థులు చెబుతున్నారు. రాజాం అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు. ఆస్తినష్టం సుమారు రూ.1.90 లక్షలు ఉంటుందని అగ్నిమాపక సిబ్బంది ప్రాథమిక అంచనావేశారు. సుమారు 100 బస్తాలు ధాన్యం కావల్సిన పంట కాలిపోయిందని, ప్రభుత్వం ఆదుకోవాలని రైతు రమణ కోరుతున్నాడు.

ఐదు ఎకరాల గడ్డివాములు..

జలుమూరు: పాగోడు గ్రామంలో ఆదివారం జరిగిన అగ్నిప్రమాదంలో ముద్దాడ సింహాచలం (కౌలు రైతు) కు చెందిన ఐదెకరాల గడ్డివాములు దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న నరసన్నపేట అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు. అగ్ని ప్రమాదానికి కారణాలు తెలియరాలేదు. అగ్నిప్రమాదం జరిగిన సమీపంలో ధాన్యం ఉన్నప్పటికీ మంటలు అదుపులోకి వచ్చి ధాన్యం వరకు మంటలు వ్యాపించకపోవడంతో గ్రామస్థులు ఊపిరి పీల్చుకున్నారు.

చందనగిరిలో పూరిల్లు..

మెళియాపుట్టి: మండలంలోని చందనగిరి గ్రామానికి చెందిన కేరాశింగి ఆదెమ్మకు చెందిన ఇంటిలో అగ్నిప్రమాదం జరిగి వస్తువులన్నీ కాలిపోయాయి. ఆదివారం వంట చేస్తుసుండగా నిప్పు ఎగిసిపడి ఇంటికి అంటుకోవడంతో ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. బాధితురాలిని ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

క్విజ్ పోటీలకు ఆహ్వానం

ఇచ్ఛాపురం రూరల్: సన్యాసిపుట్టుగలో ఈనెల 12నస్వామి వివేకానంద జయంతి పురస్కరించుకుని ఆరు నుంచి ఎనిమిదో తరగతి విద్యార్థులకు నియోజకవర్గ స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గలవారు 95533 87187, 9866303623 నెంబర్లను సంప్రదించి పేరు నమోదు చేసుకోవాలని కోరారు.

చంద్రబాబుతోనే అభివృద్ధి సాధ్యం



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న కిమిడి కళావెంకటరావు

ఎచ్చెర్ల: రానున్న ఎన్నికల్లో టీడీపీ అధికార పగ్గాలు చేపట్టం తథ్యమని, చంద్రబాబుతోనే అభివృద్ధి సాధ్యమని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి కిమిడి కళావెంకటరావు అన్నారు. దోమాంలో ఆదివారం సాయంత్రం పలువురు టీడీపీలో చేరిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం అయోమయ పరిస్థితిలో పడిందన్నారు. రాష్ట్రంలో యువగళం పేరిట పార్టీ జాతీయ కార్యదర్శి నారా లోకేశ్ చేపట్టిన పాదయాత్రతో పార్టీకి మరింత ఊపు వచ్చిందన్నారు. వైసీపీ ప్రభుత్వంపై రోజు రోజుకు వ్యతిరేకత పెరుగుతున్నట్టు చెప్పారు. వైసీపీ అధినేత తీరు నచ్చక ఇప్పటికే ఆ పార్టీకి గుడ్ బై చెప్పి పలువురు నేతలు బయటకు వస్తున్నట్టు చెప్పారు. దోమాం పంచాయతీకి చెందిన యంపాడ త్రినాథరెడ్డి, ఉప్పాడ చిన్నారెడ్డి, రేగాన హరిప్రసాద్, సూరిబాబుతో పాటు మరికొంత మంది టీడీపీలో చేరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బెండు మల్లేశ్వరరావు, మాజీ సర్పంచ్ బచ్చు కోటిరెడ్డి, పార్టీ నేతలు గాలి వెంకటరెడ్డి, కొత్తకోట అమ్మినాయుడు, పంచిరెడ్డి కృష్ణారావు, పైడి ముఖలింగం, గూరు జగపతిబాబు, మెండ రాజారావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆదిత్యుని కల్యాణం



ఐఏఎస్ అధికారి హరీష్‌కు జ్ఞాపికను అందిస్తున్న ఆలయ ఈవో

అరసవల్లి: ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారికి మార్గశీర్ష బహుళ ఏకాదశి (మతత్రయ)ని పురస్కరించుకుని కల్యాణం నిర్వహించారు. ఆలయ అనివెట్టి మండపంలో ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో వేదపండితులు మంగళ వాయిద్యాలు, వేదమంత్రాల నడుమ కల్యాణం వైభవంగా జరిగినట్టు ఆలయ ఈవో హరిసూర్యప్రకాష్ తెలిపారు. అలాగే స్వామివారికి ఆదివారం ఒక్క రోజు ఆదాయం రూ.3,38,700 లభించింది. ఇందులో టిక్కెట్ల ద్వారా రూ.68,300, విరాళాల రూపంలో రూ.95,300, ప్రసాదాల అమ్మకం ద్వారా రూ.1,75,100 ఆదాయం లభించినట్టు ఆలయ ఈవో హరిసూర్యప్రకాష్ తెలిపారు.

● అలాగే స్వామివారిని తెలంగాణ రాష్ట్ర ఐఏఎస్ అధికారి హరీష్ దర్శించుకున్నారు. వారికి ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ స్వాగతం పలుకగా, అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. వారికి స్వామివారి జ్ఞాపికను ఆలయ ఈవో హరిసూర్యప్రకాష్ అందజేశారు. కార్యక్రమంలో ఆర్డీవో రంగయ్య, ఆలయ సీనియర్ అసిస్టెంట్ కృష్ణమాచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలి

సోంపేట: పెన్షనర్ల సమస్యలు కలిసికట్టుగా సాధించు కుందామని యూనియన్ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారావు తెలిపారు. ఆదివారం సోంపేటలోని పెన్షనర్ల భవనంలో సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫ్యామిలీ పెన్షనర్ల ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి పరిష్కరించుకుం దామని తెలిపారు. సమావేశంలో కార్యదర్శి ధర్మారావు, స్థానిక నేతలు పండి కృష్ణారావు, రఘునాథ్ పాడి, టి.జోగారావు పాల్గొన్నారు.

ఘనంగా తెరవే సాహితీ సమ్మేళనం

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళం నగరంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో తెలుగు రచయితల వేదిక (తెరవే) నెలవారీ సాహితీ సమ్మేళనం సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు ఉత్తరావల్లి నాగేశ్వరరావు, రఘుపాత్రుని వెంకట రమణమూర్తి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో 14 మంది కలువు పాల్గొన్నారు. సామాజిక పరమైన వివిధ అంశాలపై కవులు బి.కోమలరావు, ముట్నూరు ఉపేంద్ర శర్మ, నిక్కు అప్పన్న, యు.నాగేశ్వరరావు, నిక్కు హరిసత్యనారాయణ, ఆర్‌వీ రమణ మూర్తి, గుడిమెట్ల గోపాలకృష్ణ, తులాల సవరమ్మ, పీవీ దుర్గా ప్రసాద్, తంగి ఎర్రమ్మ, లలితా రెడ్డి, ఐఎస్‌డీ ప్రసాద్, శ్రీనివాసరావు, సోడవరం ఈశ్వరరావు తదితరులు పాల్గొని తమ కవితలు వినిపంచారు.

కవిటిలో మోడల్ నవోదయ పరీక్ష

కవిటి: కవిటిలో ఏపీటీఎఫ్-1938 మండల శాఖ ఆదివారం నిర్వహించిన మోడల్ నవోదయ పరీక్షలో కంచిలి విద్యార్థులు సత్తాచాటారు. ఈ సందర్భంగా ఒకటి, రెండు, నాలుగో స్థానాల్లో నర్తు రాంనస్వీర్, కంబాల మహీత్, పట్నాయక్ అఖిల్‌కుమార్ నిలిచారు. వీరికి నగదు బహుమతితో పాటు మెమోంటోలను ఎంఈవో ధనుంజయ్ మజ్జి అందజేశారు.

పురందేశ్వరిని కలిసిన ఎన్ఈఆర్



పురందేశ్వరికి నమస్కరిస్తున్న ఎన్ఈఆర్

రణస్థలం: విశాఖలో ఆదివారం జరిగిన బీసీ సామాజిక చైతన్య సభలో రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరిని విజయనగరం బీజేపీ జిల్లా బీజేపీ అధ్యక్షుడు నడుకుదిటి ఈశ్వరరావు కలిశారు. ఆమెతో ప్రజల సమస్యలపై కొంత సమయం ముచ్చటించారు.

ఆర్ఎస్ఎస్‌తోనే హిందుత్వం బలోపేతం

గుజరాతీపేట: భారతదేశంలో క్రమశిక్షణ కలిగి, హిందూ సమాజాన్ని బలోపేతం చేయడంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) ఎంతగానో కృషి చేస్తోందని ఐతమ్ కళాశాల ప్రిన్సిపాల్ ఏఎస్ శ్రీనివాసరావు అన్నారు. స్థానిక పీఎస్ఎన్ఎం హైస్కూల్ ఆవరణలో ఆదివారం సాయంత్రం ఆర్ఎస్ఎస్ నగర సాంఘిక్ ఆధ్వర్యంలో సూర్యతేజం పేరిట కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడారు. తొలుత జిల్లా నలుమూలల నుంచి సేవక్‌లు వచ్చి పలు విన్యాసాలను ప్రదర్శించారు. మూడు రాష్ట్రాల సహక్షేత్ర ప్రచారక్ భరత్ కుమార్, జిల్లా సేవక్ పి.వెంకటరమణ, నగర సంఘిక్ వంగ మహేష్, సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు, టీడీపీ నాయకుడు గొండు శంకర్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తాచాటండి

శ్రీకాకుళం స్పోర్ట్స్: రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ తైక్వాండో పోటీల్లో సత్తాచాటి జిల్లాకు గుర్తింపు తీసుకురావాలని సీనియర్ క్రీడాకారులు, న్యాయవాది నౌపడ విజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక టౌన్‌హాల్ వేదికగా ఆదివారం జరిగిన 37వ జిల్లాస్థాయి సబ్‌జూనియర్ కోర్ఫ్, 12వ జిల్లాస్థాయి సబ్‌జూనియర్ ఫూమ్‌సే పోటీల ప్రారంభోత్సంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమాల్లో జిల్లా తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి తైక్వాండో శ్రీను, జిల్లా ఫెన్సింగ్ సంఘం అధ్యక్షులు బి.రాజా తదితరులు పాల్గొన్నారు.

జేసీఐ సేవలు ఎనలేనివి

శ్రీకాకుళం కల్చరల్: సేవా మార్గంలో జూనియర్ చాంబర్ ఆఫ్ ఇంటర్నేషనల్ (జేసీఐ) ఎనలేని కృషి చేస్తుందని మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి అన్నారు. జేసీఐ వ్యవస్థాపక అధ్యక్షులు జామి భీమశంకర్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీదేవి మాట్లాడుతూ.. కష్టపడితే ఎలాంటి పనులైన సాధించవచ్చునని అన్నారు. కార్యక్రమంలో జేసీఐ జోనల్ మెంటార్ కేవీ రావు, గొంపా సురేష్, సాయి సుధీర్, దూసి సంతోష్, పాలిశెట్టి మధుబాబు, నటుకుల మోహన్ తదితరులు పాల్గొన్నారు. నూతన యువ ప్రెసిడెంట్‌గా కె.అనిల్‌కుమార్, సెక్రటరీగా జె.హరీష్, ట్రెజరర్‌గా బి.మధు వైస్ ప్రెసిడెంట్‌గా ఆర్.శ్రీనివాసరావు, జాడ సాయి తదితరులు ఎన్నికయ్యారు. వారిచే ప్రమాణ స్వీకారం చేయించారు.

నీరజాకు నృత్య పురస్కారం

శ్రీకాకుళం కల్చరల్: చెన్నైకు చెందిన రంగరామానుజ వికాయేసా కల్చరల్ కౌన్సిల్, సాయినాథ కళాసమితి, సాంస్కృతిక వేదిక సంయుక్తంగా ఈ నెల 6, 7న రెండు రోజుల పాటు సీతారామర్ తిరుమన్న మండపం అన్న నగర్‌లో మార్గలి నృత్య కథంబోత్సవం 2024ను నిర్వహించారు. కార్యక్రమంలో ప్రముఖ నృత్య దర్శకురాలు నీరజ సుబ్రహ్మణ్యం కుమార్తె కె.సింధు శ్రీహర్షితచే 40 నిమిషాలు పాటు చేసిన కూచిపూడి నృత్య ప్రదర్శన అద్భుతం అలరించింది. దీంతో నీరజా సుబ్రహ్మణ్యానికి కళ సిఖరోజ్వల, ఆమె కుమార్తె సింధుశ్రీ హర్షితలకు మార్గలి కదంబ పురస్కారాలను అందజేసి ఘనంగా సత్కరించారు.

ఎస్‌ఐబీ మ్యూచువల్ ఫండ్స్ పక్కదారి

● సేల్స్ ఎగ్జిక్యూటీవే సూత్రధారి ● పోలీసులకు ఫిర్యాదు

శ్రీకాకుళం క్రైం: ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్‌లో ఖాతాదారులు దాచుకున్న నగదు పక్కదారి పట్టినట్లు బ్యాంకు విచారణాధికారి అలమూరి శ్రీనివాస మూర్తి పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. గార ఎస్‌బీఐ బ్రాంచ్‌లో లాకరులో బంగారు ఆభరణాలను తాకట్టు పెట్టి సొమ్ము చేసుకున్న ఘటనలో ఎస్పీ జీఆర్ రాధిక ఆధ్వర్యంలో పోలీసులు విచారణ చేపట్టి 9 మందిని అరెస్టు చేశారు. ఖాతాదారులకు ఆభరణాలు తిరిగి ఇచ్చే ప్రయత్నం చేస్తున్నారు. ఈ కేసులో ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్‌లో సేల్స్ ఎగ్జిక్యూటీవ్‌గా పనిచేస్తున్న ఉరిటి కిరణ్‌ను పోలీసులు నిందితుడిగా గుర్తించి అరెస్టు చేసి జైలుకి పంపించారు. అయితే, ఈ కేసు విచారణ దశలో ఉండగానే మ్యూచువల్ నిధులను కూడా దారి మళ్లించారని ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ తరుణంలో బాధితులు ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్స్ విజయవాడ కార్యాలయానికి ఫిర్యాదు చేశారు. దీంతో అలమూరి శ్రీనివాసమూర్తి అనే వ్యక్తిని విచారణాధికారిగా నియమించారు. ఈ మేరకు మ్యూచువల్ నిధులకు సంబంధించి బాధితులను విచారించారు. 2020 నుంచి 2023 వరకు మొత్తం రూ.49 లక్షల మ్యూచువల్ ఫండ్స్‌ను సేల్స్ ఎగ్జిక్యూటీవ్ ఉరిటి కిరణ్ తన సొంతానికి వాడుకున్నట్లు విచారణాధికారి గుర్తించారు. ఈ మేరకు శ్రీకాకుళం రూరల్ మండలం పెద్దపాడు పోలీసులకు కిరణ్‌పై ఆదివారం ఫిర్యాదు చేశారు. ఎస్ఐ ఎ.విజయకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలాఉండగా, తమ సొమ్మును కిరణ్ కుటుంబ సభ్యులు తిరిగి చెల్లించినట్లు కొంతమంది బాధితులు విచారణాధికారి శ్రీనివాసమూర్తికి తెలిపారు.

ప్రత్యేక ఆర్టీసీ బస్సు సర్వీసులు

గుజరాతీపేట: సంక్రాంతి పండుగ సందర్భంగా స్వగ్రామాలకు వచ్చి వెళ్లే ప్రయాణికులకు ఆర్టీసీ రెగ్యూలర్ సర్వీసులతోపాటు అదనంగా ప్రత్యేక బస్సు సర్వీసులు ఏర్పాటు చేస్తున్నట్టు డీపీటీవో ఎ.విజయ్‌కుమార్ తెలియజేశారు. ఒకేసారి రానుపోను రిజర్వేషన్లు చేసుకుంటే మొత్తం టిక్కెట్ చార్జీలో పది శాతం రాయితీ ఇస్తున్నట్టు స్పష్టం చేశారు. హైదరాబాద్ నుంచి ఈ నెల 11వ తేదీన ఏడు నాన్ ఏసీ, ఒక ఏసీ బస్సు, 12న తొమ్మిది బస్సులు, 13న ఆరు నాన్ ఏసీ, ఒక ఏసీ బస్సు మొత్తంగా 24 ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్టు తెలిపారు. అలాగే విజయవాడ నుంచి ఎనిమిది బస్సులు, రాజమండ్రి నుంచి ఐదు జిల్లాకు వచ్చేందుకు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. విశాఖ ద్వారకా బస్‌స్టేషన్ నుంచి శ్రీకాకుళం, టెక్కలి, పలాస, ఇచ్ఛాపురం వెళ్లేందుకు ప్రతి పది నిమిషాలకు ఒక బస్సు ఏర్పాటు చేశామని, అలాగే రాత్రి 9.30 గంటల నుంచి ఉదయం 5 గంటల వరకు ప్రతి గంటకు బస్సు నడుపుతున్నట్లు తెలియజేశారు. ద్వారక బస్టేషన్ నుంచి 24 గంటలు అధికారుల బృందంచే ప్రత్యేక పర్యవేక్షణ ఏర్పాటు చేశామని తెలియజేశారు. దీనిని ప్రయాణికులు గమనించాలని కోరారు.

నేడు వెయ్యి మందితో సూర్యనమస్కారాలు

గుజరాతీపేట: సంక్రాంతి పురష్కరించుకుని ఆయుష్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా అన్ని సూర్య దేవాలయాల్లో వెయ్యి మందితో సూర్య నమస్కారాలు నిర్వహించనున్నట్టు ఆ శాఖ సీనియర్ మెడికల్ ఆఫీసర్ పి.జగదీష్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు అరసవల్లి సూర్య దేవాలయం ఇంద్రపుష్కరిణి వద్ద సోమవారం ఉదయం ఎనిమిది గంటలకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు తెలిపారు. ఆయుష్ సిబ్బంది, హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ, యోగా సంఘాల సమన్వయంతో చేపడుతున్నామన్నారు. యోగా సాధకులంతా ఉదయం ఏడు గంటలకు చేరుకోవాలని, ఇదే ప్రాంగణంలో ఆయుర్వేద, హోమియో, యునాని ఉచిత మెగా మెడికల్ క్యాంపు కూడా నిర్వహిస్తున్నామన్నారు.

10న జిల్లా స్థాయి కబడ్డీ ఎంపికలు

శ్రీకాకుళం స్పోర్ట్స్: జూనియర్ జిల్లా బాలబాలికల కబడ్డీ జట్ల ఎంపికను ఈ నెల 10వ తేదీన నిర్వహించనున్నట్టు జిల్లా కబడ్డీ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ధర్మాన రామలింగనాయుడు, సాధు శ్రీనివాసరావు తెలిపారు. ఈ ఎంపికలు స్థానిక కోడి రామ్మూర్తి స్టేడియంలో నిర్వహించడం జరుగుతుందని, ఉదయం తొమ్మిది గంటలకు హాజరు కావాలన్నారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు బాలురు 75 కిలోలు, బాలికలు 65 కిలోలు ఉంటూ 20 ఏళ్ల వయసు లోపు ఉండాలన్నారు. వీరంతా 2004 ఫిబ్ర వరి రెండో తేదీ తర్వాత జన్మించినవారై ఉండాలన్నారు. ఇందులో ఎంపికైనవారు ఈ నెల 20 నుంచి 23వ తేదీ వరకు నంద్యాలలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

'ప్రోత్సహించే పార్టీకే మద్దతు'

సోంపేట: రాజకీయంగా అగ్నికుల క్షత్రియులకు ప్రోత్సహించే పార్టీలకే తమ మద్దతు ఉంటుందని అగ్నికుల క్షత్రియ సేవా సంఘం ప్రతినిధులు తెలిపారు. ఆదివారం బారువలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ జిల్లాలోని టెక్కలి, పలాస, ఇచ్ఛాపురం నియోజ కవర్గాల్లో అధిక సంఖ్యలో ఉన్నారని, అగ్నికుల క్షత్రియులకు రావాల్సిన అవకాశాలు ఇతరులు అందిపుచ్చుకుంటున్నారని తెలిపారు. సంఘ ప్రతినిధులు జుత్తు నీలకంఠం, దున్న లోకనాథం, ఉప్పరవల్లి ఉదయ్ కుమార్, మడియా రామకృష్ణ, బచ్చల మధు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

సరుబుజ్జిలి: సింధువాడలో ఆదివారం సీతారామ యువజన సంఘం ఆధ్వ ర్యంలో పోలినాయుడు స్మారక మండల స్థాయి క్రికెట్ పోటీలను టీడీపీ నాయకుడు మీసాల రామారావు ప్రారంభించారు. 48 జట్లు పాల్గొనగా ఫైనల్ ల్లో విన్నర్‌గా నిలిచిన జట్టుకు ట్రోఫీతో పాటు 15 వేలు, రన్నర్ జట్టుకు ట్రోఫీతో పాటు పది వేలు నగదు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

కవిటి: డి.గొనగపుట్టుగలో జిల్లాస్థాయి క్రికెట్ పోటీలను ఎమ్మెల్యే బెందాళం అశోక్ ఆదివారం ప్రారంభించి మాట్లాడారు. జిల్లా స్థాయి పోటీలు నిర్వహించటం వల్ల క్రీడాకారుల్లో పోటీతత్వాన్ని పెరుగుతుందన్నారు. ఎమ్మెల్సీ నర్తు రామారావు, జనసేన నాయకులు రాజు పాల్గొన్నారు.

కార్మిక ద్రోహి జగన్‌రెడ్డి

● టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు కళావెంకటరావు



రణస్థలం: పైడిభీమవరం కార్మిక చైతన్య యాత్రలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కళా వెంకటరావు

రణస్థలం, జనవరి 7: కార్మిక ద్రోహి జగన్‌రెడ్డికి రానున్న ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు కిమిడి కళావెంకటరావు అన్నారు. ఆదివారం పైడిభీమవరంలో కార్మిక చైతన్యయాత్రలో ఆయన మాట్లాడుతూ.. వైసీపీ పాలనలో రాజహింస జరుగుతుందని, కష్టపడి పనిచేసిన కార్మికులు హక్కుల కోసం రోడ్డెక్కే పరిస్థితి వచ్చిందన్నారు. సంక్షేమ బోర్డును నిర్వీర్యం చేసి నిధులు దారి మళ్లించిన ఘనుడు జగన్‌రెడ్డి అని ఆరోపించారు. ఎన్నికల సమయంలో మద్యపాన నిషేధం చేస్తానని హామీ ఇచ్చిన జగన్‌రెడ్డి మహిళలను మోసం చేశాడన్నారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులకు పర్మినెంట్ చేస్తానని, మూడు లక్షల మంది కార్మికులకు అన్యాయం చేసిన ఘనుడు జగన్‌రెడ్డి అని టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గొట్టుముక్కల రఘురామరాజు అన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి పతివాడ నారాయణస్వామి, నెల్లిమర్ల టీడీపీ ఇన్‌చార్జి కర్రోతు బంగారాజు, టీఎన్‌టీయూసీ నాయకులు జగన్నాథంనాయుడు, రౌతు శ్రీనివాసరావు, టీడీపీ నేతలు లంక శ్యామలరావు, లంక ప్రభ, గొర్లె విజయనాయుడు, పిసిని జగన్నాథంనాయుడు, దన్నాన సత్తిబాబు, కనకారావు, పైడి అప్పడదొర, పిన్నింటి భానోజీ నాయుడు, జనసేన నేత వడ్డాది శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే కార్మిక సంక్షేమం

ఎచ్చెర్ల: టీడీపీతోనే కార్మిక సంక్షేమం సాధ్యమని టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు జి.రఘురామరాజు అన్నారు. టీడీపీ పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా బాబు ష్యూరిటీ- కార్మికుల భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమం ఆదివారం చిలకపాలెం జంక్షన్ కు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన ఆటో యూనియన్ నాయకులతో కలిసి వారి జెండాలను ఆవిష్కరించిన అనంతరం మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు గాదు నారాయణరావు, ఆ సంఘ జోన్ 1, 2, 3 నాయకులు లెనిన్, సింధూజ, పరమేశ్వరరావు, కార్మిక సంఘ నేతలు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్లను తిరిగి ప్రారంభిస్తాం

గుజరాతీపేట: టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అన్న క్యాంటీన్లను తిరిగి ప్రారంభిస్తామని టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గొట్టుముక్కల రఘురామరాజు అన్నారు. కార్మిక చైతన్య బస్సు యాత్రలో భాగంలో స్థానిక పాత బస్టాండ్ కూడలి లోని భవన నిర్మాణ కార్మికులతో ఆదివారం సమావేశమయ్యారు. కార్మికులు నాలుగున్నరేళ్లుగా పనులు లేక ఇబ్బంది పడుతున్నారని, చంద్రబాబు పాలనలో రాష్ట్రంలో కార్మికులు చాలక 40 లక్షల మందిని పక్క రాష్ట్రాల నుంచి వచ్చేవారన్నారు. కార్యక్రమంలో టీఎన్టీయూసీ జోన్ ఇన్‌చార్జిలు కోగంటి లెనిన్‌బాబు, అంబూరు సింధూజ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శివాజీ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జునరావు, తదితరులు పాల్గొన్నారు.



ఎచ్చెర్ల: నినాదాలు చేస్తున్న టీఎన్‌టీయూసీ నాయకులు

'రా...కదలి రా'లో భాగస్వామ్యం కావాలి : బగ్గు



నరసన్నపేట: వైసీపీ అరాచక పాలనకు స్వస్తి పలికేందుకు ప్రతి ఒక్కరూ 'రా.. కదలిరా' కార్యక్రమంలో భాగస్వాములు కావాలని మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రాభివృద్ధికి చంద్రబాబు నాయుడుతో కలిసి అడుగులు వేయాలని కోరారు. సీఎం జగన్‌రెడ్డి కులాల పేరుతో ప్రజలను విడగొట్టి మరలా అధికారంలోకి వచ్చేం దుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. వైసీపీ పాలనలో బీసీలు, ఎస్సీ, ఎస్టీలు దగా పడ్డారన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ప్రవేశ పెట్టిన సూపర్ సిక్స్ పథకాలపై ప్రజల్లో మంచి స్పందన వస్తోందన్నారు.

రానున్న వంద రోజులు కీలకం

● టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు



అచ్చెన్నతో టెక్కలి నియోజకవర్గ నాయకులు

టెక్కలి: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడును ఆదివారం కోటబొమ్మాళి క్యాంపు కార్యాలయంలో పలు జిల్లాలకు చెందిన టీడీపీ నేతలు మర్యాద పూర్వకంగా కలిశారు. పుట్టపర్తి, అరుకు, గాజువాక తదితర ప్రాంతాలతో పాటు టెక్కలి, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి, నందిగాం మండలాలకు చెందిన ముఖ్య నాయకులు, కార్యకర్తలు ఆయనను కలిసి పుష్ప గుచ్ఛాలు ఇచ్చి అభినందించారు. ఈ సందర్భంగా రానున్న 100 రోజులు కీలకమని, ఈ సందర్భంగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై టీడీపీ, తెలుగు యువత ప్రతి నిధులతో చర్చిం చారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు బగాది శేషగిరి, బోయిన రమేష్, జీరు భీమారావు, వెలమల విజయలక్ష్మి, మెండ దమయంతి, అట్టాడ రాంప్రసాద్, తెలుగు యువత ప్రతినిధులు కోళ్ల కామేసు, రెడ్డి అప్పన్న, మామిడి రాము, మల్లిపెద్ది మధు, మల్ల బాలకృష్ణ, వెలమల కామేసు, గురువెల్లి బాలకృష్ణ, పోలాకి చంద్రశేఖర్, సుబ్రహ్మణ్యం, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ కులగణనతో సత్ఫలితాలు

కోటబొమ్మాళి: శాస్త్రీయ కులగణనతో సత్ఫలితాలు సాధించవచ్చని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. ఏపీ బీసీ న్యాయవాదుల సంఘం రూపొందించిన 2024 డైరీని ఆది వారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే బీసీల కులగణనపై కేంద్రంపై ఒత్తిడి తీసుకు వస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అగూరు ఉమామహేశ్వరరావు, చౌదరి లక్ష్మణరావు, జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్ని సూర్యారావు, న్యాయవాదులు పాల్గొన్నారు.









హిరమండలం, జలుమూరు: గొటివాడ, ఇచ్ఛాపురం రూరల్: కేశుపురం, సారవకోట మండలం చీడిపూడిలో బాబు ష్యూరిటీ నిర్వహిస్తున్న టీడీపీ నేతలు, కార్యకర్తలు

● హిరమండలం: సీఎం జగన్ రెడ్డి అరాచక పాలనకు చరమగీతం పాడాలని జడ్పీటీసీ పి.బుచ్చిబాబు అన్నారు. హిరమండలంలో బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలుపించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ● జలుమూరు: టీడీపీతోనే యువతకు భవిష్యత్తు సాధ్యమని యూనిట్ ఇన్‌చార్జి బోడేన బాలకృష్ణ అన్నారు. గొటివాడ గ్రామంలో ఆదివారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ నిర్వహించారు. కార్యక్రమంలో నేతలు మొయ్యి శ్రీనివాసరావు, ఎం.లక్ష్మణమూర్తి, మెండ సింహాచలం, శిమ్మ గోవిందరావు తదితరులు పాల్గొన్నారు. ● జలుమూరు (సారవకోట): వైసీపీ పాలనలో రాష్ట్రం రావణకాష్టంగా మారిందని టీడీపీ మండల అధ్యక్షుడు కత్తిరి వెంకటరమణ అన్నారు. చీడిపూడి గ్రామంలో ఆదివారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కింజరాపు రామారావు, యాళ్ల వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు. ● ఇచ్ఛాపురం రూరల్: వైసీపీ అరాచక పాలనను అంతమొందిం చాలని టీడీపీ మండల నాయకులు దక్కత కామేశ్వరరావు కోరారు. ఆదివారం కేశుపురంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గుజ్జు భీమరాజు, పి.పురుషోత్తం, డి.నరేంద్ర, పి.హేమసుందర్ పాల్గొన్నారు.

ఐక్యతతోనే అభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న తూర్పుకాపు సంఘ నేతలు

మెళియాపుట్టి: ఐక్యతతోనే అభివృద్ధి సాధ్యమని తూర్పుకాపు సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు పిసిని చంద్రమోహన్ అన్నారు. గొప్పిలి సంతతోట మైదానంలో ఆదివారం పలాస నియోజకవర్గ తూర్పు కాపు సంఘ నేతల ఆత్మీయ సమావేశం డా.చిన్నన్నాయుడు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బీసీ-డి నుంచి బీసీ-సిలోకి చేర్చేంత వరకు పోరాటం చేద్దామన్నారు. గ్రంథాలయ మాజీ చైర్మన్ పీరుకట్ల విఠల్‌రావు మాట్లాడుతూ.. కాపు కులస్థులు నిరు పేదలను ఆర్థికంగా ముందుకు తీసుకువెళ్లేందుకు సహ కరించాలన్నారు. నిమ్మాన పాపారావు మాట్లాడుతూ.. పలాసలో కాపు భవనం నిర్మాణానికి స్థలమిస్తామన్నారు. పలాస నియోజకవర్గ సంఘ అధ్యక్షుడిగా నక్క అనిల్‌కుమార్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సనాపతి కిషోర్, మజ్జి శ్రీదేవి, సలాన మోహనరావు, మజ్జి భాస్కరరావు, ఎంపీడీవో ఎన్.రమేష్ నాయుడు, కాశీబుగ్గ సీఐ జి.శంకరరావు పాల్గొన్నారు.

జీడి, వరి రైతులపై నిర్లక్ష్యం తగదు

కాశీబుగ్గ: జీడి, వరి రైతుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని, ఇది ఎంత మాత్రం తగదని పలాస నియోజకవర్గ జనసేన నాయకులు హరీశ్ కుమార్ శ్రీకాంత్, సీనియర్ నాయకుడు కోన కృష్ణారావు అన్నారు. ఆదివారం కాశీబుగ్గ గాంధీ విగ్రహం వద్ద జనసేన ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. జనసేన పార్టీ పలాస నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ దుర్గారావు, యాదవ్, అవినాష్, సీపీఐ నాయకుడు వెంకటరమణ సంఘీభావం తెలిపారు.

పరీక్షలపై భయం వీడనాడాలి

నరసన్నపేట: పరీక్షలంటే భయం వీడనాడి ఉత్సాహంగా రాస్తే విజయం తథ్యమని మేఘాలయ కేడర్ ఐఏఎస్ అధికారి సాధు శిబిచక్రవర్తి అన్నారు. ఆదివారం జమ్ము జనజాగృతి ఆధ్వర్యంలో గీతాంజలి పబ్లిక్ స్కూల్‌లో నవోదయ మోడల్ పరీక్షను నిర్వహించి బహుమతులు అందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సాధు దిలీప్ చక్రవర్తి, కె.కోటిబాబు, బి.ధనుంజేయ్‌దేవ్, అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీముఖలింగేశ్వరుని గ్రామోత్సవం

జలుమూరు: దక్షిణకాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీముఖలింగంలో శ్రీముఖలింగేశ్వర స్వామికి ఆదివారం గ్రామోత్సవం నిర్వహించారు. మార్గశిర బహుళ ఏకాదశి పర్వదినం పురస్కరించుకొని స్వామికి అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలను పల్లకిలో వేంచేపు చేసి తిరువీధి చేపట్టారు. కార్యక్రమంలో ఈవో పి.ప్రభాకరరావు, అర్చకులు, పలువురు భక్తులు పాల్గొన్నారు.

జడ్పీ చైర్‌పర్సన్ రాజీనామా చేయాలి



నినాదాలు చేస్తున్న ఆదివాసీ నాయకులు

పాతపట్నం: నకిలీ బెంతుఒరియాలకు కొమ్ము కాస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ తక్షణం రాజీనామా చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ డిమాండ్ చేసింది. ఈ మేరకు నీలమణిదుర్గ ఆలయ సమీపంలో ఆదివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలో ఉన్న నకిలీ బెంతుఒరియాలను ఎస్టీ జాబితాలో చేర్చకూడదని, నకిలీ ధ్రువపత్రాలతో ఉద్యో గాలు చేస్తున్న వారిని వెంటనే తొలగించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబ యోగి, జిల్లా కార్య దర్శి బి.సింహాచలం, సలహాదారు అజారి రామారావు, నేతలు ఆసరి కర్ణారావు, సుందరాడ తవిటి నాయుడు, కొరసండ మిన్నారావు, డొల్లు శ్రీను పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఉద్యమానికి స్ఫూర్తి 'మార్పు'

టెక్కలి: ఉపాధ్యాయ ఉద్యమానికి స్ఫూర్తి ప్రదాత మార్పు బాలకిష్టమ్మ అని ఏపీటీఎఫ్ సంఘ నాయకుడు సురేష్‌కుమార్ అన్నారు. ఆదివారం టెక్కలిలో మాజీ ఎమ్మెల్సీ బాలకిష్టమ్మ సంస్మరణ సభ నిర్వహించారు. చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు చిట్టెన్న, గున్న ప్రసాదరావు, రామారావు పాల్గొన్నారు.

దైవభక్తి మోక్షానికి మార్గం

చింతాడపేట(పోలాకి): మానవులకు దైవభక్తి మోక్షానికి మార్గమని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త స్వప్న హైందవి అన్నారు. ఆదివారం దండులక్ష్మీపురం పంచాయతీ చింతాడపేట రామయోగి సేవాశ్రమంలో సత్సంగం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికత పెంపొం దించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సేవా శ్రమ అధ్యక్షుడు బమ్మిడి విశ్వనాథం లక్ష్మణరావు, గోపాలస్వామి, చంద్రయ్య పాల్గొన్నారు.


రేపటి నుంచి జాతీయస్థాయి టెన్నీకాయిట్ పోటీలు

పలాస: జాతీయస్థాయి టెన్నీకాయిట్ పోటీలు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో మంగళవారం నుంచి నిర్వహిస్తున్నారు. దీనికోసం మైదానాన్ని సిద్ధం చేశారు. ఈనెల 13వ తేదీ వరకు ఈ పోటీలను ఫ్లడ్‌లైట్లు వెలుతురులో నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర టెన్నీకాయిట్ అసోసియేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి పి.తవిటయ్య తెలిపారు. 23 రాష్ట్రాల నుంచి క్రీడాకారులు హాజరవుతుండడంతో వారికి అవసరమైన ఏర్పాట్లు చేశామన్నారు.

ఒడియా బ్రాహ్మణులు సంఘటితం కావాలి

వజ్రపుకొత్తూరు: ఒడియా బ్రాహ్మణులు సంఘటితమై సమస్యలను పరిష్కరించుకోవాలని రాష్ట్ర ఒడియా బ్రాహ్మణ సంఘ అధ్యక్షుడు శివాజీ పాణిగ్రాహి అన్నారు. అక్కుపల్లి సముద్ర తీరంలో ఆదివారం పలాస, వజ్రపుకొత్తూరు, నందిగాం మండలాల ఒడియా బ్రాహ్మణుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు చంద్రశేఖర్ త్యాడి, కార్యదర్శి బాబూరావు పండా, రాఘవ పండా, బెన్నుత్యాడి తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐగా అనిల్‌కుమార్



మందస: మందస ఎస్ఐగా బి.అనిల్‌కుమార్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఈయన విశాఖపట్నం నుంచి బదిలీపై ఇక్కడకు రాగా ఇక్కడ పని చేసిన హరికృష్ణ విశాఖ జిల్లాకు బదిలీపై వెళ్లారు.

అగ్నికుల క్షత్రియులకు సముచిత స్థానం కల్పించాలి

కాశీబుగ్గ: అగ్నికుల క్షత్రియులకు రాజకీయ రంగంలో సముచిత స్థానం కల్పించాలని ఆ సంఘం యూత్‌ఫోర్స్ జాతీయ అధ్యక్షుడు నాగిడి సాంబశివరావు అన్నారు. కాశీబుగ్గ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆదివారం దివంగత నేత, మాజీ ఎమ్మెల్యే జుత్తు జగన్నాయకులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. బారువా వరకు భారీ బైక్ ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో సంఘ నేతలు స్వార రామారావు, శివంగి వాసు, దున్న కృష్ణారావు, ఉదయ్‌కుమార్, జె.తాతారావు పాల్గొన్నారు.

జానపద కళలను పరిరక్షించాలి

● ఒడిశా మాజీ సీఎం గిరిధర్ గొమాంగో

● ఉత్సాహంగా కళాజాతర



వివిధ పరికరాలతో సంగీత ధ్వనిని ప్రదర్శిస్తున్న గిరిధర్ గొమాంగో

పలాసరూరల్: జానపద కళలను పరిరక్షించి వాటిని భావితరాలకు అందజేయాల్సిన బాధ్యత అందరి పై ఉందని ఒడిశా మాజీ ముఖ్యమంత్రి గిరిధర గొమాంగో అన్నారు. పలాస మండలం రంగోయి గ్రామం లో గిడుగు రామమూర్తి తెలుగుభాష, జానపద కళాపీఠం, బద్రి అప్పన్న స్మారక పీఠం 20వ వార్షికోత్సవ కళాజాతర ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. ఒకనాడు పల్లె పాటలు, వాయిద్యాలతో ఊరూరా ప్రదర్శనలు చేసేవారని, ప్రస్తుతం పాశ్చాత్య ప్రభావంతో అవి కనుమరుగవుతున్నాయన్నారు. వాటిని బతికించేందుకు ఇటువంటి సంస్థలు కృషి చేయడం అభినందనీయమన్నారు. జానపద గ్రంథ రచయిత కృష్ణారెడ్డి జానపద కళల ఔన్నత్యం, వాటి విశిష్టతను వివరించారు. కళింగసీమ సాహిత్య సంస్థ అధ్య క్షుడు సన్నశెట్టి రాజశేఖర్, శాస్త్రీయ నృత్యకళాకారిణి నిర్మలాదేవి, రాయలసీమ జానపద గాయకురాలు సోమిశెట్టి సరళ మాట్లాడుతూ.. కళలను పరిరక్షించేందుకు సంస్థ చేస్తు న్న కృషిని కొనియాడారు. ఒడిశా మాజీ ముఖ్యమంత్రి గిరిధర్ గొమాంగో వివిధ పరికరాలు, వస్తువులపై గరిటెలతో చేసిన ప్రదర్శనతో సంగీతాభిమానులను ఆకట్టుకున్నారు. అలాగే వివిధ జానపద కళలను కళాకారులు ప్రదర్శించగా వారిని నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమంలో సంఘ వ్యవస్థాప కుడు బద్రి కూర్మారావు, కళాకారులు గండు కామేశ్వరరావు, కిక్కర ఢిల్లీరావు, ఓంకార్, గేదెల తులసయ్య, వాసుదేవరావు, మనోజ్ కుమార్ దాసరి తాతారావు తదితరులు పాల్గొన్నారు.

చెవిలో పువ్వు పెట్టుకొని నిరసన



కాశీబుగ్గ: నిరసన తెలుపుతున్న పారిశుధ్య కార్మికులు

ఆమదాలవలస: ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానంలో విధులు నిర్వ హిస్తున్న సిబ్బందికి చెవిలో పువ్వులు పెట్టి తగిన బుద్ధిచెప్పాడని ఆమదాలవలస మునిసిపల్ పారిశుధ్య కార్మికుల సంఘ అధ్యక్షుడు కె.సంతోష్ కుమార్ తెలిపారు. పారిశుధ్య కార్మికుల 13వ రోజు సమ్మెలో భాగంగా ఆమదాలవలస సులభ్ కాంప్లెక్స్ వద్ద పారిశుధ్య కార్మికులు చెవిలో పువ్వులు పెట్టుకొని తెలియజేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు తారకేశ్వరరావు, శ్రీనివాస్ పాల్గొన్నారు. ● ఇచ్ఛాపురం: సమస్యల పరిష్కారానికి పారిశుధ్య కార్మికులు ఆదివారం మునిసిపల్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన శిబిరంలో భజన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు రమేష్ పట్నాయక్ మాట్లాడుతూ సమ్మె చేపట్టి 13 రోజులు పూర్తయినా ప్రభుత్వం సమస్యలను పట్టించుకోక పోవడం దారుణమన్నారు. ● కాశీబుగ్గ: సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మునిసిపల్ పారిశుధ్య కార్మికులు చేపట్టిన సమ్మె ఆదివారానికి 13వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆ సంఘ నేతలు మాట్లాడుతూ.. సీఎం జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవా లన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో సంఘ నేతలు గణపతి, శ్రీనివాస్‌రావు, మురుగన్, రవి, సీతమ్మ, సావిత్రి, శంకర్, ప్రకాష్, ముఖి తదితరులు పాల్గొన్నారు.



ఇచ్ఛాపురం: శిబిరం వద్ద భజన చేస్తున్న కార్మికులు



ఆమదాలవలస: నిరసన తెలుపుతున్న కార్మికులు

ముందస్తు సంక్రాంతి సంబరాలు

నరసన్నపేట/పలాస, జనవరి 7: ప్రభుత్వ వసతి గృహాల్లో ఆదివారం ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. నరసన్నపేట బీసీ, సోషల్ వెల్ఫేర్ బాలికల వసతి గృహాలతో పాటు పలాస బీసీ వసతిగృహంలోనూ ఈ వేడుకలు చేపట్టారు. హాస్టళ్లకు సెలవులు ప్రకటించిన నేపథ్యంలో సంబరాలు చేపట్టారు. రంగవల్లులను తీర్చిదిద్ది భోగీ మంటలు వేయడంతో పాటు పాయసం వండి పంచిపెట్టారు. సంస్కృతీ సంప్రదాయాలు ఉట్టిపడేలా ఉత్సవాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో బీసీ సంక్షేమాధికారి అనూ రాధ, ఏఎస్‌డబ్ల్యూవో త్రినాథరావు, వార్డెన్లు సుజాత, టెంక సూర్యప్రభ, డి.కృష్ణవేణి, ఉపాధ్యాయినులు, విద్యార్థినులు పాల్గొన్నారు.





నరసన్నపేట: ఎస్సీ, పలాస: బీసీ హాస్టల్‌లో సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థినులు

'ఎస్మా' ఉత్తర్వులు దహనం చేసి..

● కొనసాగిన అంగన్‌వాడీల నిరసన

న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం గడచిన 27 రోజులుగా చేపడుతున్న నిరవధిక సమ్మెను అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది కొనసాగిస్తున్నారు. వివిధ రూపాల్లో ప్రభుత్వానికి నిరసనలు తెలియజేస్తున్నారు. అయితే ప్రభుత్వం వారిపై ఎస్మా ప్రయోగిస్తూ ఉత్తర్వులు జారీ చేయడంపై ఆగ్రహావేశాలు పెల్లుబికాయి. ఈ ఉత్తర్వుల కాపీలను దహనం చేసి నినాదాలు చేశారు.

-ఆంధ్రజ్యోతి బృందం



ఇచ్ఛాపురం: జీవో ప్రతులు దహనం చేస్తున్న ఎమ్మెల్యే అశోక్, అంగన్ వాడీ కార్యకర్తలు



కోటబొమ్మాళిలో...



నరసన్నపేట: జీవో కాపీలను దహనం చేస్తూ...

చెంచమ్మ మృతి టీడీపీకి తీరనిలోటు



చెంచమ్మ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎంపీ రామ్మోహన్

పలాస: మున్సిపల్ మాజీ కౌన్సిలర్ గాలి చెంచమ్మ మృతి టీడీపీకి తీరని లోటని ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష, మాజీ మంత్రి గౌతు శివాజీ అన్నారు. పార్టీ జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి గాలి కృష్ణారావు తల్లి చెంచమ్మ ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే. ఆమె దశదిన కర్మలో ఆదివారం పాల్గొని సంతాపం తెలిపారు. వీరి వెంట రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూ రావు, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి లొడగల కామేశ్వరరావుయాదవ్, పీరుకట్ల విఠల్‌రావు, గురిటి సూర్యనారాయణ, టంకాల రవిశంకర్‌గుప్తా, బడ్డ నాగరాజు, సప్ప నవీన్, డొక్కరి శంకర్, జోగ మల్లి, మాజీ ఎంపీపీ బత్తిన హేమేశ్వరరావు పాల్గొన్నారు.

ఎంపీ పరామర్శ



పలాసరూరల్: గురుదాసుపురంలో టీడీపీ మండల అధ్యక్షుడు కుత్తుమ లక్ష్మణరావు తండ్రి నర్సింహమూర్తి అనారోగ్యంతో మృతి చెందగా ఆయన కుటుంబాన్ని ఆదివారం ఎంపీ రామ్మోహన్‌నాయుడు పరామర్శించారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు ఉన్నారు.

జగన్ నుంచి రాష్ట్రాన్ని కాపాడాలి

జి.సిగడాం: రాష్ట్రానికి పట్టిన శని సీఎం జగన్‌రెడ్డి అని, ఆ శని నుంచి రాష్ట్రాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ప్రజలపై ఉందని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కిమిడి కళావెంకటరావు పిలుపునిచ్చారు. వాండ్రంగి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ బూరాడ వెంకటరమణ తల్లి అమ్మడమ్మ, సీతంపేటకు చెందిన శాసపు సత్యం సోదరుడు రేషన్ డీలర్ రామకృష్ణ ఇటీవల మృతి చెందారు. వారి కుటుంబాలను ఆదివారం పరామర్శించారు. నాయకులు కుమరాపు రవికుమార్, టంకాల మౌళీశ్వరరావు, శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

రేపు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక

పాతపట్నం: స్థానిక విద్యుత్ సబ్ డివిజనల్ కార్యాలయ ప్రాంగణంలో మంగళవారం విద్యుత్ విని యోగదారుల సమస్యల పరిష్కార వేదికను నిర్వహిస్తున్నట్లు ట్రాన్స్‌కో టెక్కలి ఈఈ జి.శంకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఫోరం చైర్మన్ విశ్రాంత న్యాయమూర్తి బి.సత్యనారాయణ అధ్యక్షతన జరుగుతుందని, విద్యుత్ సమస్యలను పరిష్కరించుకోవచ్చన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తలపై ఎస్మా సిగ్గు చేటు

పలాస: అంగన్‌వాడీ కార్యకర్తలపై వైసీపీ ప్రభుత్వం ఎస్మా చట్టాన్ని ప్రయోగించడం సిగ్గుచేటని పీవోడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు బి.ఈశ్వరమ్మ అన్నారు. స్థానిక సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ కార్యాలయంలో ఆదివారం విలేకర్లతో మాట్లాడుతూ.. న్యాయమైన డిమాండ్ల కోసం సమ్మె చేస్తుంటే వాటిని పరిష్కరించాల్సింది పోయి పోరాటాలపై ఉక్కుపాదం మోపడం దారుణమన్నారు. సమావేశంలో సుహాసిని, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

ఎస్మా ప్రయోగం దుర్మార్గం

టెక్కలి: సమస్యల పరిష్కారం కోసం నిరవధిక సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బందిపై ప్రభుత్వం ఎస్మా ప్రయోగించడం దుర్మార్గమని జనసేన టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి కణితి కిరణ్ కుమార్ అన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం వారికి తక్షణం గ్రాట్యుటీని వర్తింపజేసి రూ.26 వేలు వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

శిరీష పరామర్శ

వజ్రపుకొత్తూరు: కిడిసింగి గ్రామానికి చెందిన కడమటి కిష్టమ్మ మృతి చెందడంతో ఆ కుటుంబానికి గౌతు శిరీష ఆదివారం పరామర్శించారు. తన ప్రగాఢ సానుభూతి వ్యక్తంచేశారు. ఆమెతో పాటు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అనుకూలచంద్ర మార్గంలో నడవాలి

ఇచ్ఛాపురం రూరల్ : ప్రముఖ ఆధ్యాత్మిక గురువు ఠాకూర్ అనుకూల చంద్ర మార్గంలో నడవాలని ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. ఆదివారం ఈదుపురం సత్సంగ విహార్ కేంద్రం ప్రతిష్ఠ ఉత్సవం నిర్వహించారు.